క్లుప్తంగా

రోడ్డు పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

నెల్లికుదురు: మండలంలోని కాస్య తండా (సంధ్యతండా) పరిధిలోని బోడియా తండా వద్ద ధ్వంసం చేసిన తారు రోడ్డును ఐటీడీఏ డీఈ రాంరెడ్డి, ఏఈ ఎర్రయ్య, తహసీల్దార్ భీమవరం భగవాన్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. 'సాక్షి'లో ఈనెల 13న ప్రచురించిన 'తారు రోడ్డు ధ్వంసం' అనే శీర్షికకు స్పందించిన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి చేసిన ప్లాట్లలో తారు రోడ్డును కలుపుకునేందుకు ధ్వంసం చేసిన రోడ్డుపై అడ్డు కట్టగా వేసి వాటిని జేసీబీతో తొలగించారు.

డాక్టరేట్ ప్రదానం



గూడూరు: మండలంలోని నాయకపల్లి గ్రామానికి చెందిన బొలగాని శ్రీనివాస్ ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను సోమవారం అందుకున్నాడు. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్ ఐరాల లోకానందరెడ్డి ఆధ్వర్యంలో 'ఆర్థిక శ్రేయస్సుపై ఆర్థిక అక్షరాస్యత ప్రభావం, ఆర్థిక అనుభవం, డబ్బు పట్ల వైఖరిలో మధ్యవర్తిత్వం పాత్ర-పట్టణ గృహ రుణ గ్రహీతలపై అధ్యయనం' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినట్లు ఆయన శ్రీనివాస్ తెలిపారు.

ఉడుమును కాపాడిన ఎఫ్‌బీఓ



కొత్తగూడ: ఇంట్లోకి వచ్చే ఎలుకల కోసం ఏర్పాటు చేసిన గమ్ ట్రాప్‌లో ఓ ఉడుము పిల్ల చిక్కుకుంది. వచ్చిన సమాచారం మేరకు ఎఫ్‌బీఓ సూరయ్య గమ్ ట్రాప్‌లో నుంచి ఉడుమును తీసి దానికి అంటుకున్న గమ్‌ను మొత్తం తీసి నీటిలో కడిగి అడవిలో వదిలేశాడు. ఉడుమును పట్టుకుని కడగడంపై స్థానికులు ఎఫ్‌బీఓను అభినందించారు.

మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్



నెహ్రూసెంటర్: గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా అధ్యక్షుడిగా ముంజాల రాజేందర్ గౌడ్‌ను నియమిస్తున్నట్లు సంఘం జాతీయ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్‌గౌడ్ సోమవారం తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా మద్దెల శ్రీనివాస్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బుర్ర రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా బుడిగె భద్రసేనాగౌడ్, గడ్డం సమ్మయ్యతోటు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

18నుంచి మణుగూరు ఎక్స్‌ప్రెస్ హాల్ట్

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో ఈనెల 18 నుంచి సికింద్రాబాద్ నుంచి మణుగూర్ వెళ్లే మణుగూర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇచ్చినట్లు రైల్వే అధికారుల నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కుష్టు బాధితులను గుర్తించాలి

తొర్రూరు: కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ చెప్యాల వనాకర్‌రెడ్డి అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీపీఎంఓ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, మందులు సత్వరమే అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మానస, జ్వలిత, ప్రియాంక, సీహెచ్‌ఓ రుద్రపతి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగాత్మక పరిశీలన



కురవి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా పరిశీలన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించారు. జూలై నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థినులు మల్యాల కేవీకే శాస్త్రవేత్త కిశోర్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మక పరిశీలన కార్యక్రమాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు కోఆర్డినేటర్ బెడదవీరన్న, రైతులు మేక వెంకటరెడ్డి, గుమ్మళ్ల మల్లయ్య, ఎక్కేటి వీరారెడ్డి, కానుగంటి మల్లయ్య, ఎక్కేటి నాగమణి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు

- కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే హరిప్రియ క్షీరాభిషేకం

గార్ల: రాంపురం, మద్దివంచ పంచాయతీల ప్రజల చిరకాల కోరికను ఎట్టకేలకు సీఎం కేసీఆర్ పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లు నిధులు మంజూరు చేయడంతో సోమవారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ గార్ల పాకాల ఏటి వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలకారు. రాంపురం సర్పంచ్ తారాబాయి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. పాకాల ఏటి వద్ద జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. 40 ఏళ్ల నుంచి పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు గత ఎమ్మెల్యేలను విన్నవించగా ఎవరూ పట్టించుకోలేదన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం అసెంబ్లీలో పలుమార్లు లేవనెత్తి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈమేరకు



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

పంచాయతీరాజ్ శాఖ నుంచి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

108 వాహనం ప్రారంభం

మండలానికి నూతనంగా కేటాయించిన 108 వాహనంను ఎమ్మెల్యే సీహెచ్‌సీ ఎదుట ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ శివాజీ చౌహాన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, కోఆప్షన్ సభ్యులు ఎండి ఖదీర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్, సర్పంచ్‌లు మోతీలాల్, ధరావత్ సక్రు, శంకర్, తారాబాయి, రాజ్‌కుమార్ జాదవ్, రైతుబంధు మండల కన్వీనర్ రాధాకృష్ణ, సత్యనారాయణ, ఉత్తరయ్య, గణేష్ పాల్గొన్నారు.



108 వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో సకల సదుపాయాలు

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతే గ్రామాల్లో సకల సదుపాయాలు సమకూరాయని ఎమ్మెల్యే రెడ్యానాయక్ తెలిపారు. మండలంలోని ఫకీరాతండా, బూరుగుపాడు, కన్నెగుండ్ల, దుబ్బతండా గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తన పర్యటన ద్వారా స్థానిక సమస్యలు గుర్తించి అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి చేశాం కనుకే రాబోయే ఎన్నికల్లో తాను ఏడోసారి ఎమ్మెల్యేగా, మూడోసారి కేసీఆర్ సీఎంగా విజయం సాధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, సర్పంచులు గుగులోత్ సునీతావీరన్న, బజ్జూరి ప్రమీల, భారతి, గుగులోత్ శ్రీనునాయక్, ఎంపీటీసీ సభ్యులు కుమారి, ఎంపీడీఓ అపర్ణ, నాయకులు పాల్గొన్నారు.



ఫకీరాతండాలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నిలిచిన పనులు పూర్తి చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కోర్టు నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు 4 ఏళ్ల క్రితం ప్రారంభించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ పనులను పూర్తి చేయకుండా వదిలేశారని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డి ధర్మన్న అన్నారు. జిల్లా కేంద్రంలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన శిలాఫలకం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఇప్పటికైనా నిలిచిన పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, పాల్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' వివరాల సేకరణ

గూడూరు: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఇంటి ఖాళీ స్థలాలను సోమవారం తహసీల్దార్ అశోక్‌కుమార్ పరిశీలించారు. నిబంధనల ప్రకారం అర్హులకు ఇల్లు మంజూరు అవుతుందన్నారు.

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో నిరుపేదలు చేసుకున్న గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తహసీల్దార్ భీమవరం భగవాన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వివిధ గ్రామాల నుంచి 3వేల దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో తహసీల్దార్ నరేష్, ఉప్పరపల్లి గ్రామంలో ఎంపీడీఓ రవీందర్‌రావు పలు ఇళ్లను పరిశీలించి జాబితా తయారు చేశారు. గృహలక్ష్మి పథకంపై కార్యదర్శులతో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

బీజేపీతోనే నిరుద్యోగ యువతకు న్యాయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంచందర్‌రావు

తొర్రూరు రూరల్: బీజేపీతోనే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు అన్నారు. మండలంలోని పోలెపల్లి, అమ్మాపురం గ్రామాల్లో పలువురు యువకులు సోమవారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయన్నారు. రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సురేష్, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్, రచ్చ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కాషాయజెండా ఎగరడం ఖాయం

దంతాలపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడం ఖాయం అని మహిళా మోర్చా రాష్ట్ర సభ్యురాలు, డోర్నకల్ మాజీ జెడ్పీటీసీ గుగులోత్ దేవికనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి నియోజకవర్గంలో ప్రత్యామ్నాయం బీజేపీ అన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తో నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మేరీ మాటి- మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మొక్కలు నాటే క్యాక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ ప్రభాస్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, నియోజకవర్గ కన్వీనర్ తాడ పూర్ణచందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురళీ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మొక్క నాటాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్క నాటాలని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు అన్నారు. సోమవారం కళాశాలలో ప్రధాన మంత్రి పిలుపు మేరకు ఎన్‌ఎస్‌ఎస్ 1,2 యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో సుమారు 100 మొక్కలను అధ్యాపకులు, విద్యార్థులు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామరత్నమాల, హత్తిరామ్, శివజ్యోతి, శశికాంత్, మల్లేశం పాల్గొన్నారు.



దంతాలపల్లి: మొక్క నాటుతున్న దేవికనాయక్

ఇన్‌ఫెక్షన్‌తో ఎడమ కాలు తొలగింపు

- ఆర్‌ఎంపీ నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: ఓ మహిళ ఎడమ కాలుకు గాయం కాగా, ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు కాలుకు చేసిన వైద్యం వికటించడంతో ఇన్‌ఫెక్షన్ కావడంతో ఎడమ కాలును తొలగించారు. ఈ మేరకు ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్వాకంతోనే కాలును కొట్టివేయాల్సి వచ్చిందంటూ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు మండలంలోని భుక్యారాంతండాజీపీ శివారు అవుసలితండాకు చెందిన తౌనూరి సక్కుబాయి ఎడమ అరికాలుకు దెబ్బతగలడంతో గాయం అయింది. దీంతో మహముద్‌పట్నం గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు కాలుకు వైద్యం చేయాలంటే రూ.25వేలు ఖర్చు అవుతుందన్నాడు. కొద్దిరోజులుగా అతడు వైద్యం చేస్తూ వస్తున్నాడు. క్రమక్రమంగా అరికాలుకు ఇన్‌ఫెక్షన్ మొదలైంది. ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇన్‌ఫెక్షన్ ఎక్కువైందని వైద్యులు ఆపరేషన్ చేసి మోకాలు కింది భాగం వరకు తొలగించారు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం మూలంగానే కాలును తొలగించాల్సి వచ్చిందంటూ ఆమె కుమారుడు సురేష్ ఆరోపించాడు. తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఆర్‌ఎంపీపై బాధితులు ఫిర్యాదు చేశారు.



సక్కుబాయి కాలును తొలగించిన వైద్యులు

ఎస్పీకి ఫిర్యాదు

నెల్లికుదురు: రియల్ ఎస్టేట్ వ్యాపారి నర్సింహారెడ్డితో ప్రాణభయం ఉందని జిల్లా ఎస్పీ కార్యాలయంతోపాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బానోతు బాలాజి నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నెల్లికుదురు మండలం కాస్య తండా (సంధ్యతండా) గ్రామ పంచాయతీ నర్సింహులగూడెం రెవెన్యూ పరిధిలో గల భూవివాదంలో నెల్లికుదురు పోలీసుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారి బేతం నర్సింహారెడ్డి భయభ్రాంతులకు గురి చేస్తునానడని విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు



మాట్లాడుతున్న సత్యనారాయణ

గార్ల: సీతారామ ప్రాజెక్ట్ నీళ్ల ఇల్లందు నియోజకవర్గానికి రాకుండా, వేరే మండలాలకు తరలించి జల దోపిడీకి పాల్పడిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలని అఖిలపక్షం నాయకులు జడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడారు. 2016లో సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్ట్ కింద ఇల్లందు నియోజకవర్గంలోని రోళ్లపాడు రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారన్నారు. ఈనెల 17న గార్లలో అఖిలపక్షం పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, గిరిప్రసాద్, కృష్ణగౌడ్, కుమార్‌గౌడ్, వెంకన్న, మురళి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

తొర్రూరు: బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో బ్రాహ్మణ ప్రతినిధుల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బ్రాహ్మణ పరిషత్‌కు రూ.100కోట్లు కేటాయించి బ్రాహ్మణుల ఆత్మగౌరవం పెంచారని, రూ.12కోట్లతో 9 ఎకరాల్లో హైదరాబాద్‌లో బ్రాహ్మణ సదన్ నిర్మించడం శుభపరిణామమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక సంస్థల సీట్ల కేటాయింపులో బ్రాహ్మణులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ, ప్రతినిధులు తమ్మెర విశ్వేశ్వరరావు, వీరభద్రరావు, శ్రావణ్‌శర్మ, రఘు శర్మ, ఓలేటి వెంకటాచార్యులు, లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతీయ జెండాల అందజేత



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం విమోచన దినం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను, పలువురు ప్రముఖులకు సిబ్బంది జాతీయ జెండా అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో తపాలా శాఖ సహాయ పర్యవేక్షకుడు ఎల్.సైదానాయక్, అధికారులు సంపత్, సునీత, రాంచందర్, సుధాకర్, అనిల్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కురవి: మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు కుంట యాదగిరి తెలిపారు. అధ్యక్షుడిగా కుంట యాదగిరి, ఉపాధ్యక్షుడిగా గుడిబోయిన సతీష్, గౌరవ అధ్యక్షుడిగా చెన్నబోయిన కృష్ణ, కార్యదర్శిగా బానోత్ వీరశేఖర్, కోశాధికారిగా భూక్య కృష్ణ, కుటుంబ భరోసా అధ్యక్షుడిగా దూదికట్ల రవీంద్రాచారిలను ఎన్నుకున్నారు.

ప్రత్యేక పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మీ సోమవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

టై, బెల్టుల అందజేత

మరిపెడ రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆనెపురం ప్రాథమికోన్నత హెచ్‌ఎం గుగులోతు మంగు అన్నారు. ఆనెపురం పాఠశాల విద్యార్థులకు దాత స్వరాజ్యలక్ష్మి టై, బెల్టులును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంబాబు, వీరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను డోర్నకల్ నియోజకవర్గ యువజన నాయకుడు డీఎస్ రవిచంద్ర, ఎంపీపీ పద్మ వెంకట్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకుడు మురళీధర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మంగపతిరావు, మండల అధ్యక్షుడు రాంసింగ్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే బ్రిడ్జి నిర్మాణం

గార్ల: సీపీఐ పార్టీ పోరాటాల ఫలితంగానే గార్ల పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లు నిధులు మంజూరయ్యాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు

గార్ల: తల్లి ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అని సీడీపీఓ ఎం.ఎల్లమ్మ గర్భిణులకు సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం మండలంలోని రాంపురం పంచాయతీ పులిగుట్టతండా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంపూర్ణ, సర్పంచ్ తారాబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో గల అమ్మో ఒడి వృద్ధాశ్రమంలో తొర్రూరు పట్టణానికి చెందిన సామాజిక సేవా ప్రతినిధి కనుకపూడి సుచరిత సోమవారం 10వ తరగతి స్నేహితులతో కలిసి జన్మదిన వేడుకలను అనాథ వృద్ధుల మధ్యలో జరుపుకున్నారు. కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాముగౌడ్, పర్షయ్య, లక్ష్మయ్య, లింగయ్య, సురేందర్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని రెడ్యాల గ్రామంలో వీఎస్‌ఆర్ యువసేన, గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పిల్లలకు ప్యాడ్లు, పుస్తకాలు, పలకలు పంపిణీ చేసి విద్యార్థులకు భోజనం పెట్టారు.

అక్కకు తలకొరివి పెట్టిన చెల్లెలు

నెల్లికుదురు: మండలంలోని మధనతుర్తి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గండం అన్నపూర్ణ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. సర్పంచ్ కొమ్ము అనిల్, గ్రామస్తుల సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించగా మృతురాలికి ఎవ్వరూ లేకపోవడంతో చెల్లెలు నాగలక్ష్మి తలకొరివిపెట్టింది.

గాలికుంటు నిరోధక టీకాలు వేయించాలి

పెద్దవంగర: గాలికుంటు వ్యాధి సోకకుండా నిరోధక టీకాలను పశువులకు రైతులు వేయించాలని పశు వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలోని పశుఆరోగ్య ఉపకేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. కార్యక్రమంలో వీఏ ప్రభాకర్, వీఎల్‌ఓ సుమన్, ఎస్ఎస్‌ఏ యాకయ్యలు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు


మహబూబాబాద్ రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడలు, స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్ నాయక్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన నాగెల్లి సందీప్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, ఎంపీటీసీ కత్తి స్వామి పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని గాంధీపురం జీపీలో గల ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న భుక్యా రెడ్యాకు 15నెలలుగా జీతం రాకపోవడంతో, ఇదే గ్రామానికి చెందిన భుక్యా రామచంద్రునాయక్ సోమవారం అతడికి రూ.4వేల ఆర్థిక సాయం అందజేశాడు.

జిల్లా సహాయ కార్యదర్శిగా లచ్చయ్య



మరిపెడ రూరల్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సహాయ కార్యదర్శిగా మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ రిపోర్టర్ జిన్నా లచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

నాణ్యతా లోపంతో డ్రెయినేజీ పనులు

మహబూబాబాద్రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో 2, 3వ వార్డుల పరిధిలో జాతీయ రహదారి 365 పక్కన అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులను అసంపూర్తిగా నాణ్యతలు లేకుండా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. జమాండ్లపల్లి గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులను కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. తూతూ మంత్రంగా కాంట్రాక్టర్ డబ్బులకు ఆశపడి కట్టడం దారుణమని విమర్శించారు. డ్రెయినేజీ మీద నడిస్తే కుంగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇకనైనా పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గండు కార్తీక్ గౌడ్, టీపీసీసీ రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి అంబాల శివకుమార్, నిమ్మ శ్రీనివాస్ గౌడ్, పిట్టల నవీన్, మాజీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, నాయకులు వీరేందర్, రాము, యాకూబ్ పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజయ్య


జర్నలిస్ట్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మరిపెడ రూరల్: జర్నలిస్ట్‌ల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘం జిల్లా అధ్యక్షుడిగా కురవి మండల కేంద్రానికి చెందిన చిత్తనూరి శ్రీనివాస్ రెండోసారి ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికయ్యాడు. ఈసందర్భంగా మండలంలోని బీచ్‌రాజ్‌పల్లిలో చైర్మన్ నవీన్‌ను చిత్తనూరి శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నాడు. శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందించాడు.

మత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్

డోర్నకల్: కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలు చేస్తుందని డోర్నకల్‌లో సోమవారం బీజేపీ నాయకులు మౌనప్రదర్శన నిర్వహించారు. బ్యాంక్ స్ట్రీట్ నుంచి రైల్వేస్టేషన్ సెంటర్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించిన అనంతరం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. బీజేపీ దేశాభివృద్ధి కోసం కృషి చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశానికి గుర్తింపు తెస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవానాయక్, జయరాజ్ గణేష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, నవీన్, రెహమాన్, వేణు పాల్గొన్నారు.

16నుంచి సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మెబాట



సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని లేని ఎడల ఈనెల 16నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సెకండ్ ఏఎన్‌ఎంలు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం తహసీల్దార్‌కు సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొన్నిరోజులుగా పలు రకాల ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ నోటిఫికేషన్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండానే రెగ్యులరైజ్ చేయాలన్నారు.

భర్త కాపురానికి రావడం లేదని ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: భర్త కాపురం చేయడానికి రావడం లేదని ఓ భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ సతీష్ సోమవారం రాత్రి తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బానోతు చాంప్ల కుమార్తె సోనియాకు తేజావత్ మోహన్ కుమారుడు యశ్వంత్‌తో ఈ ఏడాది ప్రేమ వివాహం జరిగింది. యశ్వంత్, భార్య సోనియా ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొన్ని నెలలు బాగానే కలిసి ఉన్నారు. రెండు కుటుంబాల మధ్య ఏం జరిగిందేమో కానీ మూడు రోజులుగా యశ్వంత్ తన తల్లిదండ్రులైన రమాదేవి, మోహన్ ఇంటికి వచ్చి ఉంటున్నాడు. దీంతో సోనియా భర్త ఇంటికి వెళ్లి వారితో గొడవ పడింది. సోనియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోనియా తండ్రి బానోతు చాంప్ల, బానోతు సోనా, గుగులోత్ కిషన్, తేజావత్ సుస్మిత, మరి కొంతమంది వచ్చి ఇంటిపై ఘర్షణకు దిగారని, సదరు వ్యక్తులతో తమకు ప్రాణహాని ఉందని, తన కొడుకు యశ్వంత్‌కు మాయమాటలు చెప్పి తమ ఆస్తిని కాజేయాలని సోనియా పెళ్లి చేసుకుందని యశ్వంత్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు సీఐ సతీష్ తెలిపాడు.